# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 05-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 18వ విడత నిధులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీఈ రోజు విడుదల చేశారు.**

**2. తిరుమలలో నూతనంగా నిర్మించిన వకుళమాత కేంద్రీకృత వంటశాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు ప్రారంభించారు.**

**3. నీటికాలువల పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించడంతో పాటు సుందరీకరణ పనులను చేపడుతున్నామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

**4. రాష్ట్రంలో ని నెల్లూరు, ఒంగోలు నగరాల్లో త్వరలో నూతన విమానాశ్రయాలకు శంకుస్థాపన చేయనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.**

**5. ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు పేర్కొన్నారు.**

==========================

దేశంలో రైతుల ఆర్థిక సాధికారత కోసం కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. మహారాష్ట్ర పర్యటనలో భాగంగా వాషిమ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 18వ విడత నిధులను ప్రధాన మంత్రి ఈ రోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వికసిత్ భారత్ లక్ష్యంలో రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా దేశవ్యాప్తంగా 9.4 కోట్ల మంది రైతులు 20 వేల కోట్ల రూపాయలకు పైగా ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనాన్ని పొందుతున్నారని ప్రధాన మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 35 సెకన్లు)

అదేవిధంగా వాషిమ్ లోని బంజారా కమ్యూనిటీ వారసత్వాన్ని చాటిచెప్పే బంజారా విరాసత్ మ్యూజియాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు. కాగా ఈ రోజు సాయంత్రం థానేలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తారు.

--------------------------

తిరుమలలోని పాంచజన్యం వెనుక వైపున 13కోట్ల 75 లక్షల రూపాయల టిటిడి నిధులతో నూతనంగా నిర్మించిన వకుళమాత కేంద్రీకృత వంటశాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ (29 సెకన్లు)

అనంతరం తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులతో ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరుమల ఆలయ పవిత్రతను కాపాడేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. తిరుమలలో భవిష్యత్ నీటి అవసరాలకు తగ్గట్లు నీటి లభ్యత ఉండేలా చూసుకోవాలని, ఇందుకోసం ముందస్తు ప్రణాళికను రూపొందించాలన్నారు. అటవీ సంరక్షణతో పాటు అడవుల విస్తరణ కోసం వచ్చే 5 ఏళ్లకు ప్రణాళికతో పనిచేయాలని, జీవవైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. టీటీడీ అందించే సేవలపై భక్తుల నుంచి స్పందన తీసుకోవాలని...భక్తుల సూచనలు, సలహాల ఆధారంగా సేవలపై పనిచేయాలని అధికారులనీ ముఖ్యమంత్రి ఆదేశించారు.

-------------------------

రాష్ట్రంలో నీటికాలువల పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించడంతో పాటు సుందరీకరణ పనులను చేపడుతున్నామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని నీటి కాలువలను అధికారులతో కలిసి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇప్పటికే విజయవాడలో ఆపరేషన్ బుడమేరు కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే ఆక్రమణలు తొలగింపు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు.

-------------------------

స్వర్ణాంధ్ర-2047 ప్రణాళిక రూపకల్పనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర హోం శాఖా మంత్రి వి. అనిత అన్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ పై నిన్న అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు వస్తాయని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో పరిశ్రమలు, పర్యాటకం, వ్యవసాయ రంగాల అభివృద్ధిపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు నాణ్యమైన విద్యను వైద్య సౌకర్యాలకు విజన్ డాక్యుమెంట్ లో ప్రాధాన్యతను కల్పిస్తామని మంత్రి వివరించారు.

-------------------------

రాష్ట్రంలో ని నెల్లూరు, ఒంగోలు నగరాల్లో త్వరలో నూతన విమానాశ్రయాలకు శంకుస్థాపన చేయనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో తిరుపతి నుంచి ఢిల్లీకి వెళ్లే ఇండిగో విమానాన్ని కేంద్రమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో గతంలో 75 విమానాశ్రయాలు ఉండేవని, ఎన్డీయే ప్రభుత్వ హయంలో ఆ సంఖ్య 156 పెరిగిందని చెప్పారు. తిరుపతి విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమాన సేవలను త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్రమంత్రి తెలుపుతూ,

వాయిస్ (32 సెకన్లు)

-------------------------

పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా జిల్లా విజన్ ప్లాన్ రూపకల్పనపై భీమవరం కలెక్టర్ కార్యాలయంలో నిన్న మంత్రి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ప్రధానంగా ఉన్న వ్యవసాయం, ఆక్వా, కొబ్బరి, సముద్ర తీర ప్రాంత పర్యాటకం, ఆధ్యాత్మిక పర్యాటకం వంటి అంశాలను పరిగణలోకి తీసుకోని ప్రణాళికలు రూపొందించాలన్నారు. యువతకు ఉపాధి మార్గాలను కల్పించే దిశగా నైపుణ్యాభివృద్ధి గణనను నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు అన్నారు. శ్రీకాకుళంలో నిర్మిస్తున్న కలెక్టర్ కార్యాలయ సముదాయాల నిర్మాణ పనులు మంత్రి ఈ రోజు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ ఒకే చోట అందించేలా శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయ సముదాయాల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. నిర్మాణ పనులను రెండునెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొస్తామని తెలిపారు. నిర్మాణం పూర్తి అయితే ఒకే చోట 68 శాఖల అధికారులు సిబ్బంది వుంటారని.. దీనివల్ల ప్రజలకు సత్వరమే ప్రభుత్వ సేవలు అందుతాయని మంత్రి వివరించారు.

---------------------------

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం లో రేపటి నుంచి ఈ నెల 7 వతేదీ వరకు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు భారత అంతరిక్ష కేంద్రం-షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ తెలిపారు. భీమవరంలో ఆయన మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1999లో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ప్రతి ఏటా అక్టోబర్ 4 నుండి 10వ తేదీ వరకు నిర్వహించాలని ప్రకటించిందని ఈ మేరకు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ప్రజల కోసం అంతరిక్ష ప్రదర్శనలతో పాటు విద్యార్థులకు రాత, క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తామన్నారు. "వాక్ ఫర్ స్పేస్ వీక్". అంశంపై శాస్త్రవేత్తలతో ఉపన్యాసాలు, వీడియో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సభ్యత నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు. నెల్లూరు నగరంలోని శివాజీ సెంటర్లో బిజెపి సభ్యత కార్యక్రమాన్ని కేంద్రమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచంలో ఎక్కువ మంది సభ్యులున్న పార్టీగా బిజెపి నిలిచిందని చెప్పారు. సభ్యత్వ నమోదుతో పాటు స్థానిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేల కృషి చేస్తామని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

---------------------------

నంద్యాల జిల్లాలోని శ్రీశైలంలో దసరా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ మహోత్సవాలలో భాగంగా మూడవ రోజు భ్రమరాంభికా అమ్మవారు చంద్రఘంట అలంకారంలో దర్శనం ఇవ్వనున్నారు. దీనిపై మా ఆకాశవాణి నంద్యాల జిల్లా ప్రతినిధి బి.శేఖర్ మరిన్ని వివరాలను అందిస్తారు.

వాయిస్ (39 సెకన్లు)

====================